సాక్షి
సంగారెడ్డి
శనివారం । 17 । ఆగస్టు । 2024



సంగారెడ్డి ఎస్‌ఎస్‌కె సమాజ్‌లో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

న్యూస్‌రీల్

మూగజీవాలను హింసిస్తే చర్యలు : అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: మూగ జీవాలను హింసించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్పీసీఏ(సొసైటీస్ ఫర్ ప్రివెంటీషన్ ఆఫ్ క్రూలిటీ ఏనిమల్స్) కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 43751, మున్సిపాలిటీ ప్రాంతాల్లో 17770 కుక్కలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వాటి సంఖ్య పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తను రోడ్డు పక్కన వేసేవారికి నోటీసులు అందించి, జరిమానాలు విధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, అసిస్టెంట్ డైరెక్టర్లు డా.రవీందర్, డా.ప్రభాకర్, నదోదయ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

- అదనపు కలెక్టర్ మాధురి



డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

పటాన్‌చెరు టౌన్: ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ మాధురి ఆదేశించారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, ఈ విషయం గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. స్పందించిన అదనపు కలెక్టర్.. ఉన్నత అధికారులతో మాట్లాడి డ్రైనేజీ వ్యవస్థకు నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

మహిళలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

సంగారెడ్డి : ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. కొత్త బస్టాండ్ ఎదుట కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జార్జ్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కూన సంతోష్, అనసూయ, జ్యోతి, వాణి పాల్గొన్నారు.

ఆహారభద్రతకు సలహా సంఘాలు

పుల్‌కల్(అందోల్) : ఆహార భద్రతకు పెద్దపీట వేయాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు శ్వేత, రాహుల్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గొంగ్లూర్ గ్రామంలో వ్యవసాయ విద్యార్థులకు, రైతులకు ఆహార ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గాంధీ గ్రామసేవ కేంద్రంలో ఆహార సలహా కేంద్రం, ఆహార డేటా సమాచార కేంద్రం, కుటుంబ సలహా కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆర్.రాంచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మంజ్రేకర్ పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ పొంది 2024లో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లించేందుకు షెడ్యూల్ విడుదలైనట్లు డీఈఓ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ అభ్యాసకులు పరీక్ష ఫీజును మీసేవ, టీజీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరు కాని వారితో పాటు ఫెయిల్ అయినవారు కూడా పరీక్షలు రాయవచ్చని పేర్కొన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30వ తేదీ వరకు, రూ.25 రుసుంతో సెప్టెంబర్ 4వ తేదీ వరకు, రూ.50తో సెప్టెంబర్ 9వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఇతర వివరాలకు 8008403635 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వరలక్ష్మీ.. వరాలు ఇవ్వమ్మా..



శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు జిల్లావ్యాప్తంగా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ గృహాలలో లక్ష్మీదేవి ప్రతిమను ఏర్పాటుచేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. మరికొందరు ఆలయాల్లో సామూహికంగా వ్రత క్రతువులో పాల్గొని అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సహస్ర నామార్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, రవికలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తోటి మహిళలకు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి:





లక్ష్మీదేవిని మొక్కుతున్న మహిళ



అమ్మవారికి ఒడిబియ్యం పోస్తున్న మహిళలు

లైన్ క్లియర్!

- జహీరాబాద్ మున్సిపాలిటీ ఎన్నికలకు మార్గం సుగమం
- 37 వార్డులతో అధికారుల తాజా ప్రకటన
- విలీన అడ్డంకులు తొలగితే ఐదు నెలల్లో కొత్త పాలకవర్గం
- ప్రత్యేకాధికారుల పాలనలో కుంటుపడిన అభివృద్ధి



మున్సిపల్ కార్యాలయం

జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో 37 వార్డులను ఏర్పాటు చేస్తూ అధికారులు ప్రకటన వెలువరించారు. మున్సిపల్ పరిధిలో గతంలో 24 వార్డులు ఉండగా ఐదు గ్రామాలను విలీనం చేయడంతో విస్తీర్ణం పెరగడంతో అందుకు అనుగుణంగా వార్డుల సంఖ్యను పెంచారు. మున్సిపల్ అధికారులు వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేసి ప్రకటించడంతో మున్సిపల్ ఎన్నికలకు అడ్డంకులు తొలగిపోయినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు వాయిదా

గతంలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ హోతి(కె) గ్రామానికి చెందిన ప్రజలు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మున్సిపల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాజాగా వార్డుల విభజన చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. విలీన అడ్డంకులు తొలగినట్లయితే రానున్న ఐదు నెలల్లో కొత్త పాలక మండలి ఏర్పాటయ్యే అవకాశముందనే చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీకి ఆనుకుని ఉన్న పస్తాపూర్, అల్లీపూర్, చిన్న హైదరాబాద్, రంజోల్, హోతి(కె) గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. విలీనాన్ని ఆయా గ్రామాల ప్రజలు మొదట్లో వ్యతిరేకించారు. విలీనం వల్ల తమకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయని, ఉపాధి కూలీ పనులు కూడా కోల్పోతామని, ఇంటి పన్నులు సైతం పెరుగుతాయని అప్పట్లో వ్యతిరేకించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని అప్పటి ప్రభుత్వం ఆయా గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చింది. హోతి(కె) ప్రజలు మాత్రం విలీనాన్ని వ్యతిరేకించి కోర్టుకు వెళ్లగా మిగతా గ్రామాల ప్రజలు సమ్మతించారు. హోతి(కె) విలీనం వల్ల అభ్యంతరాలు రావడంతో మున్సిపాలిటీకి ఎన్నికలు జరగలేదు. దీంతో గత నాలుగున్నర ఏళ్లుగా సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా పోయాయి. ప్రస్తుతం విలీన గ్రామాలను కలుపుకుని 37 వార్డులతో మరోసారి మున్సిపల్ కమిషనర్ నోటిఫికేషన్ వెలువరించారు. వార్డుల పునర్‌వ్యవస్థీకరణపై అభ్యంతరాలుంటే సేకరించి తుది వార్డుల జాబితాను ప్రకటించనున్నారు. అన్ని అడ్డంకులు తొలగినట్లయితే రాష్ట్రంలో ఉన్న మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగితే వాటితో పాటే జహీరాబాద్ మున్సిపాలిటీకి సైతం ఎన్నికలు జరిగి కొత్త పాలక మండలి వచ్చే అవకాశం ఉంది. అడ్డంకులు యధావిధిగా ఉంటే హోతి గ్రామాన్ని మినహాయించి ఎన్నికలు నిర్వహిస్తారా లేక ఎన్నికలు వాయిదా వేస్తారా అనే విషయం తేలాల్సి ఉంది.

నాలుగున్నరేళ్లుగా ప్రత్యేక పాలన

జహీరాబాద్ మున్సిపాలిటీకి ఎన్నికలు జరగక పోవడంతో గత నాలుగున్నర ఏళ్లుగా ప్రత్యేక పాలనలోనే కొనసాగుతోంది. ఇన్నేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.50 కోట్ల అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. అవినీతికి అవకాశం ఇస్తున్నారనే విమర్శలు సైతం వచ్చాయి. ఈ క్రమంలో ఏసీబీ దాడులు సైతం జరిగాయి. ఫలితంగా కమిషనర్ సైతం సస్పెండ్ అయ్యారు. నీతి నిజాయితీగా వ్యవహరిస్తూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే అధికారి అవసరం అయింది. ప్రస్తుత కమిషనర్ మున్సిపాలిటీని చక్కదిద్దే పనిలో పడ్డారు.

ఎన్నికలపై నిరాసక్తత

జహీరాబాద్ మున్సిపాలిటీకి ఎన్నికలను నిర్వహించే విషయంలో రాజకీయ పార్టీల నేతలు నిరాసక్తత చూపడం కారణంగానే వాయిదా పడుతూ వచ్చినట్లు ప్రచారం సాగింది. నాలుగున్నరేళ్లుగా ప్రత్యేక పాలనలో ఉండిపోయింది. జహీరాబాద్ ఆర్డీఓ మున్సిపల్ ప్రత్యేకాధికారిగా కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని ప్రచారం సాగింది. దీనికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సుముఖంగా లేకపోవడం వల్లే ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిందనే చర్చ జరిగింది. ప్రత్యేక పాలన కారణంగా అభివృద్ధి సైతం కుంటుపడిందనే చెప్పవచ్చు.

ఐదేళ్ల క్రితం విలీన ప్రక్రియ మొదలు

2019 ఏప్రిల్‌లో పరిసర గ్రామాల విలీన ప్రక్రియను మొదలు పెట్టారు. చిన్న హైదరాబాద్, అల్లీపూర్, పస్తాపూర్, హోతి(కె), రంజోల్ గ్రామ పంచాయతీలను జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో విలీనం చేశారు. అప్పట్లో హోతి(కె) గ్రామ ప్రజలు విలీనాన్ని వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారు. దీంతో వార్డుల విభజన, ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. 2024 జూలైలో పురపాలక శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డుల విభజన మళ్లీ మొదలు పెట్టారు. మున్సిపాలిటీని తాజా ఓటరు లిస్టు ప్రాతిపదికన 37 వార్డులుగా విభజించినట్లు అధికారులు పేర్కొన్నారు. అందులో భాగంగా మున్సిపల్ పరిధిలో రంజోల్ గ్రామంలో అత్యధికంగా 2280 ఓట్లతో 6వ వార్డును ఏర్పాటు చేశారు. 1798 అతి తక్కువ ఓట్లతో చిన్న హైదరాబాద్ గ్రామం ఓట్లతో 10వ వార్డుగా ఏర్పాటు చేశారు.

కేతకీలో మహారాష్ట్ర హైకోర్టు జడ్జి పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో మహారాష్ట్ర బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ శివకుమార్ డిగె కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతిపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయంలో..

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని పురాతనమైన భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయంలో బాంబే హైకోర్టు న్యాయమూర్తి శివకుమార్ డిగె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం న్యాయమూర్తి దంపతులను సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కిష్టయ్య, ఆలయ సిబ్బంది కృష్ణ, అర్చకులు వీరయ్య స్వామి,శివకుమార్ స్వామి, రుద్రయ్య స్వామి,బస్వరాజ్ స్వామి తదితరులు ఉన్నారు.



కేతకీలో జడ్జికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

గ్యాస్ గోదాంను తరలించాలి

పటాన్‌చెరు టౌన్ : పట్టణంలో జనావాసాల మధ్య ఉన్న ప్రభుత్వ హెచ్‌పీ గ్యాస్ గోదాం భవనాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఇద్దరూ భేటీ అయ్యారు. పటాన్‌చెరులో గ్యాస్ గోదాం భవనం వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని, పక్కనే రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు కాబోతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడికి నిత్యం వందలాదిమంది ప్రజలు వస్తారని, వారికి ఇబ్బందులు తలెత్తకుండా మండల పరిధిలోని రామేశ్వరంబండ శివారులో గ్యాస్ గోదాంకి స్థలాన్ని కేటాయించి తరలించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రి సూచనల మేరకు.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ ను కలిసి ప్రతిపాదన అందజేశారు.

రేషన్ డీలర్ల రాష్ట్ర మహాసభలకు రండి..

రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించతలపెట్టిన రాష్ట్రస్థాయి సదస్సుకు హాజరు కావాలని కోరుతూ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆహ్వాన పత్రికను మంత్రి ఉత్తమ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు పాల్గొన్నారు.



మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

అభివృద్ధికి నిధులు కేటాయించండి

పటాన్‌చెరు : నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. పట్టణంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

కార్పొరేట్‌ల కోసమే ట్రిపుల్‌ఆర్



భూ బాధితులకు మద్దతు తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

రైతు సంఘాల నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): పెట్టుబడి దారులు, కార్పొరేట్‌ల కోసమే ట్రిపుల్‌ఆర్ నిర్మాణం చేపడుతున్నారని, దీనివల్ల రైతులకు వచ్చే లాభం ఏమీ లేదని రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. ట్రిపుల్‌ఆర్ భూ బాధితులకు మద్దతుగా శుక్రవారం మండల పరిధిలోని గిర్మాపూర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు జయరాజు, నర్సింహారెడ్డి, రాఘవేందర్ రెడ్డి, పృథ్వీరాజు, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి రైతులంతా ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏడాదికి రెండు పంటలు పండించే భూములను లాక్కుంటే చిన్న, సన్నకారు రైతులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు?. రైతుల భూములను లాక్కొని కోకాపేటలో మాదిరిగా ప్రభుత్వ భూమిని కోట్ల రూపాయలకు అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చడంతో పాటు భూమికి భూమి ఇవ్వాలని, లేదంటే బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంజాబ్ రైతులను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలని, అన్ని సంఘాలు మద్దతుగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మల్లేశం, నాయకులు రాజయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు వెంకటయ్య, రమేష్‌కుమార్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి జోన్: నాన్ రెసిడెన్షియల్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు బీసీ నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమి, కుషాయిగూడ ద్వారా సెప్టెంబరు 1 నుంచి నవంబరు 30 వరకు 100 మంది అభ్యర్థులకు ఉచితంగా హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 ఏళ్లలోపు వయసు ఉండి ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులై, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షలలోపు ఉన్నవారు అర్హులని చెప్పారు. శిక్షణ అనంతరం ప్లేస్‌మెంటు కల్పించనున్నట్లు వెల్లడించారు. అర్హులైనవారు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాఖీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 20వ తేదీ వరకు నారాయణఖేడ్ డిపో నుంచి పటాన్‌చెరు, లింగంపల్లి, సికింద్రాబాద్, హైదరాబాద్‌కు అదనపు బస్సులు నడుపుతున్నట్లు ఖేడ్ డీఎం మల్లేశయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎం ప్రభులత, డిప్యూటీ ఆర్‌ఎం దైవాదీనంల సూచనల మేరకు ఈ బస్సులు నడుపుతున్నామని చెప్పారు.

అధికారులకు బాధ్యత లేదా..?

- పోతులబోగుడాలో తెగిపడిన విద్యుత్ తీగలు
- పట్టించుకోని విద్యుత్ శాఖ
- మరమ్మతు పనులు చేపట్టిన రైతులు

వట్‌పల్లి(అందోల్): వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈదురు గాలులకు కరెంటు తీగలు తెగిపడటం, స్తంభాలు నేలకొరుగుతుంటాయి. వాటిని వెంటనే సరి చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. మండల పరిధిలోని పోతులబోగుడా గ్రామంలో రెండు రోజుల క్రితం పంట పొలాల్లో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. మరమ్మతులు చేపట్టాలని లైన్‌మెన్‌కు రైతులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. చేసేదేమీ లేక శుక్రవారం మరో లైన్‌మెన్‌కు ఫోన్‌చేసి ఎల్‌సీ తీసుకొని అధికారులు లేకుండానే రైతులు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ విషయంపై ఏఈ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. గురువారం సాయంత్రం 7 గంటలకు విద్యుత్ తీగలు తెగిపడిన విషయం రైతులు నాకు ఫోన్‌చేసి చెప్పారని, శుక్రవారం మరమ్మతులు చేయిస్తానని చెప్పినప్పటికీ.. మరో లైన్‌మెన్ ద్వారా ఎల్‌సీ తీసుకొని మాకు తెలియకుండానే రైతులే మరమ్మతు పనులు చేసుకున్నారని సమాధానం ఇచ్చారు.



కట్టెల నిచ్చెనపై నిలబడి విద్యుత్ తీగలు సరిచేస్తున్న రైతు

ఐక్య కార్యాచరణతో సమస్యల పరిష్కారం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

సదాశివపేట(సంగారెడ్డి) : కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ గార్డెన్‌లో నిర్వహించిన ఎంఆర్‌ఎఫ్ కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో కార్మికులకు గత సంవత్సరం చేసిన అగ్రిమెంట్‌లో చాలా మోసం జరిగిందని, వీడీఏను పెంచడం, దసరా సెలవు దినం, గ్రేడ్ చేంజ్‌లు, చారిత్రత్మకమైన రెండు వేతన ఒప్పందాలు చేసిన ఘనత సీఐటీయూకే దక్కుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లు, 12 గంటల పనివిధానం మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టం తయారు చేసి అమలు చేయాలని ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, ఎంఆర్‌ఎఫ్ సీఐటీయూ నాయకులు నర్సింలు, రాజు, కృష్ణమూర్తి, విజయవీర్, శ్రీనివాస్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

దంచికొట్టిన వాన

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం కుప్పానగర్, బర్దీపూర్, మాచ్నూర్, క్రిష్టాపూర్ తదితర గ్రామాల్లో ఏకధాటిగా కురిసిన వానకు పంట పొలాల్లోకి నీరు చేరింది. జోరు వర్షానికి రోడ్లు కనిపించక వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పస్తాపూర్, అల్లీపూర్, రంజోల్ ప్రాంతాల్లో పడిన వానకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఝరాసంగం(జహీరాబాద్): మాచ్నూర్ రహదారి పక్కన పత్తి పంటలో నిలిచిన నీరు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటజోన్: భారత ప్రభుత్వ జౌళి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు సంవత్సరాల శిక్షణ కోర్సుల్లో రాష్ట్రంలో 60 సీట్లకుగాను ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణత అయి ఉండి, 01జూలై 2024 నాటికి 15 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని సూచించారు. ఆగస్టు 31లోపు డైరెక్టర్ చేనేత జౌళి శాఖ, చేనేత భవన్, నాంపల్లి హైదరాబాద్ -5000001 లేదా, సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కార్యాలయంలోని చేనేత జౌళి శాఖ కార్యాలయంలో అందచేయాలని సూచించారు.

పంట ధ్వంసం.. నలుగురిపై కేసు

కొండపాక(గజ్వేల్): పంట చేనును ధ్వంసం చేస్తూ అడ్డొచ్చిన వారిపై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. కొండపాక మండలం మర్పడ్గ గ్రామశివారులోని 269/2 సర్వే నంబర్‌లోని 1.32 ఎకరాల భూమిని దబ్బెర యాదగిరి కుటుంబీకులు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఆ భూమి మాది అంటూ బద్దిరాజ్.. ట్రాక్టర్‌తో సాగు చేసిన పెసర పంటను ధ్వంసం చేస్తుండగా.. అడ్డుకోబోయిన యాదగిరి తండ్రి భూమయ్యపై బద్దిరాజ్ కుటుంబీకులు సుందరవ్వ, పోశవ్వ, స్నేహితుడు కూస బాపురెడ్డిలు దాడి చేసి గాయపర్చారు. బాధితుడు యాదగిరి ఫిర్యాదు చేయగా నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

గోమారంలో వ్యక్తి అదృశ్యం


శంకర్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామంలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ మైపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొరకంటి శంకర్ గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా దొరకలేదు. శంకర్ భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గురువారం గుర్తుతెలియని వాహనం వ్యక్తిని ఢీట్టడంతో తీవ్రగాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కంగ్టి మండలం తడకల్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్(35)గా గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పిడుగుపాటుకు పాడిగేదె మృతి

తొగుట(దుబ్బాక): పిడుగుపాటుకు పాడి గేదె మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని వెంకట్రావుపేటలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు... గ్రామానికి చెందిన సుతారి మల్లేశానికి పాడి గేదెలే జీవనాధారం. దానిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగే మధ్యాహ్నం మేతకు వదిలాడు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పిడుగు పడి పాడి గేదె అక్కడికక్కడే మరణించింది. దాని విలువ రూ 30 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పిడుగుపాటుతో మేకలు ..

తొగుట(దుబ్బాక): పిడుగుపాటుతో మేకలు మృతిచెందాయి. ఈ సంఘటన మండలంలోని కాన్గల్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబీకుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ముడికె కనకయ్య రోజూ మాదిరిగా మేకలను ఉదయం మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం వాటిని దొడ్డిలో తొలి ఇంటికి వెళ్లాడు. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. ఈ క్రమంలో మేకల కొట్టం పైన పిడుగు పడి మూడు మేకలు మృత్యువాత పడ్డాయి. మృతిచెందిన మేకల విలువ రూ.50 వేలు ఉంటుందని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

స్పెషల్ గ్రేడ్‌కు ప్రతిపాదనలు

- ఇద్దరు కార్యదర్శులతో పాటుగా సిబ్బంది పెరిగే చాన్స్
- జిల్లాలోనే అతి పెద్ద మార్కెట్ యార్డుల్లో హుస్నాబాద్ ఒకటి
- ఇప్పుడు గ్రేడ్–2 స్థాయి
- రోజురోజుకూ పెరుగుతున్న ఆదాయం



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం

హుస్నాబాద్: జిల్లాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ యార్డులో హుస్నాబాద్ మార్కెట్ ఒకటి. ప్రస్తుతం ఈ మార్కెట్ గ్రేడ్–2 స్థాయిలో కొనసాగుతోంది. పెరుగుతున్న పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు, ఆదాయానికి అనుగుణంగా ఈ మార్కెట్‌ను స్పెషల్ గ్రేడ్ స్థాయిగా అప్‌గ్రేడ్ కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్.. మార్కెట్ అప్‌గ్రేడ్ కోసం తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులకు ప్రతిప్రాదనలు పంపినట్లు సమాచారం. ప్రస్తుతం హుస్నాబాద్ మార్కెట్ కార్యదర్శిగా సిద్దిపేటకు చెందిన మార్కెట్ కార్యదర్శి వెంకటయ్య ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. కేవలం ఆపరేటర్ ఒక్కరే మార్కెట్ నిర్వహణ బాధ్యతలను చూస్తున్నారు. కాగా, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను 14.03.1986లో స్వయం ప్రతిపత్తిగా గల మార్కెట్‌గా ఏర్పాటు చేయడం తెలిసిందే.

కోట్లల్లో క్రయవిక్రయాలు..

హుస్నాబాద్ మార్కెట్ యార్డు పరిధిలో హుస్నాబాద్, అక్కన్నపేట, చిగురుమామిడి మండలాలు ఉన్నాయి. రైతులు పండించిన పంటల ఉత్పత్తులు కోట్లల్లో ఇక్కడే క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా యాసంగి, వానాకాలంలో ధాన్యం, మొక్కజొన్న, పత్తి, పొద్దు తిరుగుడు, కందులు ఇలా ప్రతీ పంట ఉత్పత్తులను రైతులు ఇక్కడే అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందుతున్నారు. మార్కెట్ ఫీజుల రూపంలో యార్డుకు లక్షల రూపాయలు ఆదాయం ఏటా సమకూరుతోంది. 2021–22లో రూ.1.48 కోట్లు, 2022–23లో రూ.4.45 కోట్లు, 2023–24లో రూ.4.03 కోట్ల మార్కెట్ ఫీజు ద్వారా ఆదాయం వచ్చింది.

త్వరలోనే నూతన పాలకవర్గం..

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం కమిటీ సభ్యులను నియమించలేదు. చాలా చోట్ల మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గ సభ్యులను ప్రభుత్వం నియమించింది. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యుల పదవుల కోసం కాంగ్రెస్ శ్రేణులు మంత్రి చుట్టూ తిరుగుతున్నారు. మార్కెట్ కమిటీ అప్‌గ్రేడ్ అయిన తర్వాతనే నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

51 మంది లైసెన్స్‌దారులు

మార్కెట్ పరిధిలో రైతులు పండించిన పంట ఉత్పత్తులను క్రయ విక్రయాలు జరుపుకొనేందుకు 51 మంది వ్యాపారులు లైసెన్స్‌లు పొందారు. మార్కెట్ ఫీజు కిందమార్కెట్ కమిటీకి ఆదాయం వస్తుంది. మార్కెట్ పరిధిలో జిన్నింగ్ మిల్లులు 5, రైస్‌మిల్లులు 9 ఉన్నాయి. అలాగే యార్డులో సరుకులను నిల్వ చేసుకునేందుకు 2,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలు 9, 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాం ఒకటి ఉంది. మార్కెట్ అప్‌గ్రేడ్‌తో పాటుగా ఇద్దరు కార్యదర్శులతో పాటుగా సిబ్బంది పెరిగే అవకాశం ఉంటుంది.

ఆలయ రక్షణ కోసం కమిటీ ఏర్పాటు

ఏడుపాయలను సందర్శించిన ఎస్పీ

సాక్షి ఎఫెక్ట్

పాపన్నపేట(మెదక్): 'భద్రత డొల్ల 'శీర్షికన ఈ నెల 14న సాక్షిలో వచ్చిన కథనానికి ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి స్పందించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఏడుపాయల ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఆస్తులు, శాంతి భద్రతల పరిరక్షణ, దొంగతనాల నివారణ తదితర చర్యల కోసం కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అందరి సూచనల మేరకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏడుపాయల్లో ఇటీవల దొంగతనం జరిగిన తీరు, సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. ఈఓ కృష్ణ ప్రసాద్‌తో పలు విషయాలు గురించి ఫోన్‌లో మాట్లాడారు. ఏడుపాయల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.


ఏడుపాయల ఈఓ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మండల కేంద్రంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. చేర్యాల సీఐ శ్రీను శుక్రవారం విలేకరులకు ఈ కేసు వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని ఓ వెంచర్లో ముగ్గురు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో పోలీసులు వెంచర్లోకి వెళ్లారు. అక్కడ గంజాయి సేవిస్తున్న కంకణాల భరత్, నాగరాజు, లింగపల్లి దర్గయ్యలను పోలీసులు అరెస్టు చేశారు. కంకణాల భరత్, నాగరాజుల స్వస్థలం కామారెడ్డి కాగా భరత్ స్థానిక వైన్స్‌లో పనిచేస్తుండగా, నాగరాజు హైదరబాద్‌లో క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు, కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన దుర్గయ్య మాత్రం కూలిపనులు చేస్తుంటాడు. నాగరాజుకు కొంత కాలం నుంచి గంజాయి సేవించే అలవాటు ఉంది. తన స్నేహితుడైన భరత్‌కు అలవాటు చేయడంతో పాటు కొమురవెల్లిలో విక్రయించేందుకు హైదరాబాద్‌లోని ఫతేనగర్ నుంచి గంజాయి ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 40 గ్రాములు ఎండు గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు, గంజాయి సేవించేందుకు ఉపయోగించే చిల్లాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు దంపతులు


పాల్గొన్న భక్తులు

- కనులపండువగా పద్మావతి వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం
- భారీగా హాజరైన భక్తులు
- మారుమోగిన గోవింద నామస్మరణం

దుబ్బాక: పట్టణంలోని బాలాజీ ఆలయంలో పద్మావతి, వెంకటేశ్వర స్వామిల కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి కనుల పండువగా జరిగింది. బాలాజీ ఆలయం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నాలుగు రోజులుగా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవం శ్రీత్రిదండి చినజీయర్ స్వామి శిష్యబృందం, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. పద్మావతి అమ్మవారికి , వెంకటేశ్వరస్వామికి పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భజనలు, బాజాభజంత్రీలతో పట్టువస్త్రాలను తీసుకొచ్చారు. స్వామి వారి ఉత్సవ మూర్తుల ఎదుర్కోలు కార్యక్రమం వైభవంగా కొనసాగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఆలంకరించిన మండపంలో శుక్రవారం రాత్రి 6.30కు ప్రారంభమైన కల్యాణోత్సవం రాత్రి 9 గంటల వరకు జరిగింది. గోవింద నామస్మరణంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎంపీ దంపతులు

వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో ఎంపీ రఘునందన్‌రావు దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దంపతులు, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత , ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, రాజు తదితరులు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

నలుగురికి తీవ్ర గాయాలు


వెన్నెల మహేష్ (ఫైల్)

నారాయణఖేడ్: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. మరో నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం రుద్రారం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై విద్యాచరణ్ రెడ్డి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా మండల కేంద్రమైన రేగోడుకు చెందిన వెన్నెల మహేష్(20) ఈమధ్యే ఇంటర్ పూర్తిచేసి డీఫార్మసీ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకుగాను ఆధార్ అప్డేట్ చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. అదే గ్రామానికి చెందిన నవీన్(20), సాయికిరణ్(19)లతో కలిసి నారాయణఖేడ్‌కు ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి వెళుతున్నారు. రేగోడు మండలం టి.లింగంపల్లికి చెందిన సయ్యద్(24), రేహాన్(25) ద్విక్రవాహనంపై నారాయణఖేడ్‌కు వస్తున్నారు. రుద్రారం శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ వెన్నెల మహేశ్ మృతిచెందాడు. మిగిలినవారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడింది. నార్సింగి మండలం జప్తి శివునూర్ గ్రామానికి చెందిన సయ్యద్ మదార్ (55) తన భార్య బీబీతో కలిసి దౌల్తాబాద్ మండలం రామారంలో బంధువు అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. వారి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మదార్ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలపాలైన బీబీని హైదరాబాద్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు బస్టాండ్‌లో శుక్రవారం ఉదయం ముషీరాబాద్ డిపోకు చెందిన బస్సు బస్టాండ్ లోనికి వచ్చే క్రమంలో ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కోసం ఆరా తీయగా కొన్ని రోజులుగా బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మానసిక స్థితి సరిగా లేక తిరుగుతూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతుడి వయసు 35 నుంచి 45 మధ్యలో ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొనడంతో..

నర్సాపూర్: రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ అమీన్‌ఖాన్(48) మృతి చెందారు. గురువారం రాత్రి అమీన్‌ఖాన్ డీసీఎంతో షాదీఖానా వైపు నుంచి జాతీయ రహదారిపైకి రాగానే హైదరాబాద్ వైపు నుంచి వచ్చిన లారీ.. డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అమీన్‌ఖాన్‌తో పాటు డీసీఎంలో ఉన్న నర్సింలు, వెంకటేశ్‌గౌడ్, శ్రీధర్‌లకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అమీన్‌ఖాన్ మృతిచెందాడు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

నిజాంపేట(మెదక్): కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కొమ్మట రాములు, శ్యామవ్వ దంపతుల కుమారుడు భానుప్రసాద్(26) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సమీపంలోని పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

16ఎండికె57: భానుప్రసాద్(ఫైల్)

మద్యం మత్తులో చెరువులో పడి..

చేగుంట(తూప్రాన్): మద్యం మత్తులో చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చందాయిపేటలో శుక్రవారం సాయంత్రం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అచ్చంపేట మహేశ్ (26) కూలీ పనిచేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అయితే కొన్ని రోజులుగా మహేశ్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో తండ్రి వెంకటేశం మద్యం మానేసి పనులు చేసుకోవాలని సూచించాడు. గురువారం మధ్యాహ్నం మద్యం సేవించి పెద్దచెరువు వైపునకు వెళ్లిన మహేశ్ చెరువులో పడి మృతిచెందాడు. ఆచూకీ కోసం వెతుకుతుండగా శుక్రవారం సాయంత్రం చెరువులో మృతదేహం లభించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య


స్వప్న

చేగుంట(తూప్రాన్): కడుపునొప్పి భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జంగిటి స్వప్న(33) కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఇటీవల సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో కలత చెందిన స్వప్న.. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

మకర తోరణం బహూకరణ



కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలోని ప్రాంగణంలో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయానికి రాంసాగర్‌కు చెందిన భక్తులు అక్కనపల్లి సుధీర్ రెడ్డి ఉషాలత దంపతులు ఇత్తడి మకర తోరణం శుక్రవారం బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీరాములు, ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

27న సదరం శిబిరం

సంగారెడ్డి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 27న సదరం శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ గాయత్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్లాట్లు ఈ నెల 20న కేటాయించబడుతాయని, మీసేవా కేంద్రాల్లో బుక్ చేసుకుని శిబిరానికి హాజరు కావాలని సూచించారు.

అంతర పంటల సాగు..లాభాలు బాగు

పత్తి, సోయాబీన్ తదితర పంటలు సాగు

- అదనపు ఆదాయం దిశగా రైతుల అడుగు
- ఆయిల్ పామ్ తోటల్లో పంటల సాగు
- అంతర్ సాగుపై రైతుల ఆసక్తి


ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటసాగుగా పత్తి పంట


ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటగా సోయాబీన్

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా రైతులు వ్యవసాయం ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు సాగు విధానంలో మార్పులు తీసుకురావటంతో పాటు రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా దీర్ఘకాలిక పంట సాగులో స్వల్పకాలిక పంటలు అంతర పంటగా సాగు చేస్తున్నారు. ఫలితంగా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఈ విధంగా రైతులు అంతర పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో పత్తి పంటను సాగు చేసి, అందులో అంతర పంటలు సాగు చేసి లాభాలు పొందేవారు. నూతనంగా మార్కెట్‌లోకి వచ్చిన ఆయిల్ పామ్‌లో సైతం అంతర పంటలు సాగు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు ప్రోత్సాహం

ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు ప్రభుత్వ ప్రోత్సహిస్తుంది. ప్రతి సంవత్సరం ఆయిల్ పామ్ సాగు నిర్వహణ ఖర్చులకు ఎకరానికి రూ.4,200 అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నాలుగేళ్ల వరకు ప్రోత్సాహకంగా అందిస్తున్నారు. మొక్కలు, డ్రిప్స్ పరికరాలను సబ్సిడీపై ఇస్తున్నారు.

ఆయిల్‌పామ్ తోటల్లో పంటల సాగు

రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలో 3,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సాగు విధానం కలిగే ప్రయోజనాలు, దిగుబడులపై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పిస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు పంట సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే 1450 ఎకరాల్లో సాగు అవుతుందని సంబంధిత అధికారుల సమాచారం. ఆయిల్ పామ్ మొక్కలు ఒకసారి నాటి మూడేళ్ల పాటు పెంచితే నాల్గవ సంవత్సరం నుంచి 40 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఒక మొక్క చుట్టూ 9మీటర్ల దూరంగా నాటుతారు. దీంతో మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ఆయిల్ పామ్ మొక్క కంటే ఎక్కువ ఎత్తు పెరగని పంటలను సాగు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా పత్తి, సోయాబీన్, అల్లం, మునగ, పెసర, కంది తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఇతర పంటల్లో అంతర పంటగా తీగజాతి పంటలు, కూరగాయలు, పప్పు దినుసులు కాలానికి అనుగుణంగా సాగు చేస్తున్నారు.

అంతర పంట సాగుతో లాభాలు



రైతులు అంతర పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చు. నీటి సౌకర్యం ఉన్న రైతులు దీర్ఘకాలిక పంటలలో అంతర పంటలు వేసి దిగుబడులు పొందవచ్చు. పంటల సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. ఇప్పటికే రైతులకు పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించాం. అంతర సాగుతో ఒకేసారి అదనపు ఆదాయం పొందవచ్చు.

–వెంకటేశ్వర్, మండల వ్యవసాయాధికారి, ఝరాసంగం

ఆరెకరాల ఎకరాలు పత్తి సాగు



12ఎకరాల విస్తీర్ణంతో ఆయిల్ పామ్ పంటను సాగు చేశాను. ఆరేకరాల్లో ప్రస్తుతం పత్తి పంటను వేశా. మిగతా ఆరు ఎకరాల్లో మిర్చి వేసేందుకు పొలం సిద్ధం చేస్తున్నాను. ఆయిల్ పామ్ సాగులో లాభాలు పొందేందుకు అంతర పంటలు సాగు చేస్తున్నా.

– మల్లన్న పాటిల్, రైతు, చీలమామిడి

అంతర పంటగా మునగ



ప్రభుత్వం, అధికారుల ప్రోత్సాహం–అవగాహనతో ఐదెకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నాను. అంతర్‌గా మునగ పంటను సాగు చేస్తున్నాం. 6 నెలల వ్యవధిలో పంట చేతికి వస్తుంది. 3 సంవత్సరాల వరకు మునగ పంట దిగుబడి వస్తుంది. నాలుగేళ్ల నుంచి ఆయిల్‌పామ్ పంట చేతికి వస్తుంది.

– చంద్రమ్మ, రైతు, కుప్పానగర్